## సుమిత్ర

గాఢనిద్రలో ఉన్న సువర్ణ తల్లి స్పర్శతో ఉలిక్కిపడింది. అది అర్ధరాత్రి. బలవంతాన తనని తల్లి ఎందుకు నిద్ర లేపుతున్నదీ అర్థంకాలేదు. కంగారుగాలేచి కూర్చుంది.

"ఏంటమ్మా ఇదంతా?" బొంగురుపోయిన కంఠంలో తల్లిని ప్రశ్నించింది.

"సుమిత్రను ప్రక్కగదిలో ఉంచాను. వెళ్ళి ఆ అమ్మాయికి తోడుగా పడుకో."

నిద్రతో ఎరుపెక్కిన కళ్ళు కోపంతో మరింత ఎర్రబడ్డాయి. "అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా దానిగోలేనా? నేను చస్తే మంచం దిగేది లేదు. నిద్ర పాడైతే రేపు కాలేజీలో పాఠాలు చెప్పినట్లే. నన్ను విసిగించకు."

"అది కాదమ్మా, నేను మాత్రం ఊసుపోక తీసుకురాలేదు. వాళ్ళింట్లో ఆ పిల్ల ఒక్కత్తే ఉంది. ఒంటరిగా ఎలా ఉండగలదు? అందుకని తీసుకువచ్చాను. నాతో ఇంత వాదన పెట్టుకునే బదులు ఆ అమ్మాయి దగ్గర పడుకుంటే ఈ పాటికి ఎప్పుడో నిద్ర పోయేదానివి."

"నువ్వెన్నైనా చెప్పు, మాటిమాటికీ సుమిత్ర, సుమిత్ర అంటూ ఏదో ఒకటి పురమాయిస్తే నేనూరుకోను." అంటూ ప్రక్కకు తిరిగి పడుకుంది సువర్ణ. ఇక లాభం లేదని శాంత సుమిత్ర ఉన్న గదిలోకి వెళ్ళి "మా అమ్మాయి..." అనబోతుంటే "ఫరవాలేదు పిన్నీ, అయినా నేను మా ఇంట్లోనే ఉంటా నంటే విన్నావు కాదు. నేను మీకు లేనిపోని బెడద" అంది. అప్పటిదాకా ఆ తల్లీ కూతుళ్ళ సంభాషణ విన్న సుమిత్ర.

"అలా అనుకోకమ్మా, ఇరుగు పొరుగు అన్నాక ఒకరికొకరం ఏదీ పట్టనట్లుంటే ఎలా? నీకోసం ప్రత్యేకంగా మేం పడే శ్రమేమీలేదు" అంటూ సర్ది చెప్పింది. ఇంచుమించు తెల్లారేవరకు సుమిత్ర మెలకువగానే ఉంది. సూర్యోదయానికి ముందు నిద్రలోకి జారుకుంది.

"ఇంతకూ ఏమిటి కథ?" కాఫీ తాగుతూ తల్లిని అడిగింది సువర్ణ.

"సుమిత్ర ఒదిన తండ్రిపోయినట్లు టెలిగ్రాం వచ్చిందమ్మా. హుటాహుటిన బయలుదేరి భార్యా భర్తలు వెళ్ళారు. ఈ పిల్ల ఒక్కర్తీ ఎలా ఉంటుంది?"

"అందుకని మనింట్లో మకాం పెట్టించేసానంటావ్."

"ప్రతిదానికి యిలా చికాకు పడితే నేను ఏంచెప్పలేను. తండ్రిపోయిన దుఃఖంలో

ఉండికూడ సునంద ఆడపడుచుని తీసుకుపోతానంది. ఎవరిబాధలో వాళ్ళుంటే ఈ అమ్మాయిని పట్టించుకునేవాళ్ళెవరు? నాలుగురోజులు మనింట్లో ఉంచుకుంటే పోయేదేముంది? వాళ్ళన్నయ్య వస్తే ఉండమన్నా ఉండదు. ఊరికే నోరుజారకు. రాత్రి నీ మాటలకు నొచ్చుకున్నట్లుంది. లేచిందేమో కాస్త బాత్‌రూమ్ అదీ చూపించు. నేను కాఫీ కలుపుతాను."

ఇక తప్పదు- అనుకుంటూ సుమిత్రకు చేయూతనిచ్చింది సువర్ణ. "మాటిమాటికీ మా ఇంట్లో తిష్ఠ వేస్తున్నావుగా, మా ఇల్లు ఈ పాటికి అలవాటయిపోయే ఉంటుంది." అన్నప్పుడు, ఈ వూళ్ళో మీకు చుట్టాలెవరూ లేరా? - అని అడిగినపుడు సుమిత్ర మనస్సు చివుక్కుమంది. అలా అని వాళ్ళింట్లో ఉన్న నాలుగు రోజులు నాలుగు యుగాలుగా గడిచినట్లనిపించలేదు సుమిత్రకి. తనబోటి వాళ్ళకు ఈ మోస్తరు ఆటుపోట్లు ఎదురవుతూనే ఉంటాయని తెలియందికాదు. నిజానికి కన్నవాళ్ళే తన పుట్టుక భారంగా భావించినా కుమిలిపోలేదు. అన్నయ్య అందించిన రవ్వంత చేయూతతో ఇప్పటి ఈస్థితికి రాగలిగింది. అన్నయ్య పెళ్ళై ఒదిన ఇంటికి వచ్చినపుడు తన జీవితంలో మరోమలుపు అనుకుంది. కొత్తకోడల్ని చూడటానికి వచ్చేవాళ్ళు, వదిన స్నేహితులు అంతా మీ ఆయన్ది మంచి ఉద్యోగమే, అత్త మామలూ మంచి వాళ్ళే. భలే ఛాన్సే కొట్టేసావ్. కాని మీ ఆడపడుచే - అని తన ఎదురుగా తన ప్రస్తావన తీసుకు వచ్చేవారు. కొత్తల్లో వదిన నవ్వి ఊరుకుంది. అంతేమరి; ఎంత అనుకున్నా ఏం చేయగలం? ఇద్దరం ముచ్చటగా గడిపే అదృష్టం మాకుండొద్దా. ఈ జీవితాలిలా సాగిపోవలసిందే అని తన ఉనికి కష్టం అనిపించినప్పుడు వాపోయేది. అమ్మ, నాన్న చనిపోయాక అన్నయ్య కూడ ఆ మోస్తరు భావాన్నే వ్యక్తం చేసేవాడు.

"చెల్లెలికి పెళ్ళిచేసి పంపడంతో అన్నయ్యల బాధ్యతలు తీరిపోతాయి. కానీ మాకలాకాదు. ఈ బరువు, బాధ్యత శాశ్వతం."

అవేవీ తను మనస్సుకు పట్టించుకోదు. అన్నయ్య ఆత్మీయంగా దగ్గర కూర్చుని కబుర్లు చెప్పిన మధుర క్షణాలు, ఒదిన ఆప్యాయంతో భోజనం వడ్డిస్తూ తనతో మాట్లాడిన అరుదైన అనుభూతులు నెమరు వేసుకుంటుంది.

చేదు అనుభవాలన్నీ ప్రక్కకు నెట్టేసి మనస్సునిండా మధురిమలు నింపుకోవడం వల్లనే తను దీక్షతో కళాసాధనచేయగలిగింది. ప్రఖ్యాత గాయని సుమిత్ర అని పేరు తెచ్చుకుంది. తనగానంతో శ్రోతలను ఎంతో రంజింపచేస్తోంది. అన్నా వదినలకు కూడ తనంటే చులకన భావం తగ్గి అభిమానం కలగటానికి తను సమాజంలో తెచ్చుకున్న కీర్తి ప్రతిష్ఠలే కారణం. మా చెల్లెలు ఇంత గొప్పగా పాడుతుందని అన్నయ్య, మా ఆడపడుచు ఇన్ని కచేరీలు చేసిందని వదిన; ఫ్రెండ్స్‌తో చెప్పుకుంటూంటే తను ఆనంద లోకాలలో తేలిపోతుంది. తనవాళ్ళు తనని గురించి తోటి వారితో చెప్పుకుని ఒరకం తృప్తిని కలిగిస్తే గానంతో తన జీవితాన్నే సార్థకం చేసుకున్నందుకు మరో రకం సంతృప్తి. లేనిదాని కోసం బాధపడకుండా తన లోపాన్ని పదే పదే తలుచుకుంటూ మనస్సుని చంపుకోకుండా ఒక ఆనందంకోసం బ్రతకటంలోనే ధన్యత

కనిపిస్తుంది. సుమిత్రకి తను చూడలేని ప్రపంచాన్ని తీయని పాటల్లో, మమతలు నిండిన పలకరింపుల్లో వెతుక్కుంటుంది. చీదరింపులు, ఛీత్కారాలు లెక్కచేయదు. సువర్ణకూడా అప్పుడపుడు కాస్త ఆత్మీయత, స్నేహ భావంచూపితే వాటినే గుండెలో పదిలపరుచుకుంది సుమిత్ర.

★ ★ ★

"చెల్లాయి నీకో శుభవార్త చెప్పనా?" అంటూ సుమిత్ర చేయందుకున్నాడు శ్రీధర్. "మీరేం చెప్పొద్దు, మా ఆడపడుచుకి నేనే చెప్తాను. ముందు నోరుతెరు. అల్లరి ఆడపడుచూ" సుమిత్ర నోట్లో స్వీటు పెట్టి దగ్గరకు తీసుకుంది సునంద.

"ఏమిటొదినా ఈ హడావిడంతా?"

'ఇక రోజూ హడావిడే మరి! ... అంటే, అమ్మాయిగారు ఉద్యోగస్థురాలై పోయారు.' అవునమ్మా, ఆ మధ్య నువ్వు ఇంటర్వ్యూ కెళ్ళావేం; ఆ వి.ఆర్. గవర్నమెంటు కాలేజీలో మ్యూజిక్ లెక్చరర్‌గా నువ్వే సెలక్టయ్యావు!' అని అన్నయ్య చెప్పేడు. సుమిత్ర సంతోషానికి అవధులు లేవు.

"అన్నట్టు సుమిత్రా, నువ్వు మరో విధంగా కూడా అదృష్టవంతురాలివే. మన సువర్ణ కూడ అదే కాలేజీలో పాలిటిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తోంది కదూ. నీకు సహాయంగాఉంటుంది."

"ఏమో వదినా; నాకంతా కొత్తగా, బెరుగ్గానే ఉంటుంది."

"ఏం ఫరవాలేదులే చెల్లాయ్! ఆ వాతావరణంలో అడుగుపెడితే ఇట్టే కలిసిపోతావు అందరితోను."

అన్నయ్య అన్నట్లు సుమిత్ర కాలేజీలో చేరిన కొద్దిరోజుల్లోనే చాలామందికి తలలో నాలుకైపోయింది.

ఆమె మాట తీరు, శిక్షణ ఇచ్చే విధానం తోటివారిని ఛలోక్తులతో నవ్వించటం నాలుగు వైపులనించీ ప్రశంసలే తెచ్చిపెట్టాయి ఆమెకు. సువర్ణ ఓ వారం కూడా సుమిత్రకు సహాయ సహకారాలు అందించలేదు. అమ్మ ఎంత పోరినా, సునంద ప్రాధేయ పడినా చెవిని పెట్టలేదు. ప్రతీరోజూ రిక్షాలో, కలిసి మెలిసి తిరగడానికైనా అన్నిటిలోనూ తనతో సమస్థాయిలో ఉండాలి. ఎవరైనా ఆవిడమీకేమౌతుందని అడిగితే ఆ గ్రుడ్డిదాని గురించి తనేం చెప్పాలి? రక్తం పంచుకుని పుడితేనే తప్పించుకు తిరగాలనిపిస్తుంది. అలాంటిది తనకేమీ కాని ఎవరినో తనెందుకు వెంటేసుకు తిరగాలని. ఇలాంటి భావాలు కలిగిన సువర్ణ తను పనిచేస్తున్న కాలేజీలోనే సుమిత్రకు ఉద్యోగం వచ్చినందుకు బాధపడింది. ఆమె ఉదయం పదిగంటలకు కాలేజీకి వెళ్ళాలి గనుక, తను ప్రిన్స్‌పాల్‌తో చెప్పి ఏడుగంటకే మార్చుకుంది. తెలివిగా తప్పించుకుని తనలో తనే గర్వపడింది. ఇది వరకటిలా కూడా సుమిత్రతో మాట్లాడ్డం మానేసింది. నీ పద్ధతి నాకేం నచ్చటం

లేదు-అని అమ్మ అంటూంటే-నాన్నగారితో చెప్పి ఎలాగైనా ఈ ఇల్లు ఖాళీ చేసెయ్యాలి అప్పటికైనా పీడ వదుల్తుంది- అనుకుంది. తమ కొలీగ్స్ సుమిత్రకు అన్నివిధాలా సహాయ పడుతుంటే తమతో సమానంగా చూసుకుంటుంటే సువర్ణకి ఆశ్చర్యం కలుగుతోంది. తెలుగు లెక్చరర్ విద్యతో "ఎందుకలా సుమిత్రతో రాసుకు, పూసుకు తిరుగుతావు. ఏం చూసి? అన్ని ఫంక్షన్స్‌కీ ఆవిడగారు తయారవుతుంది. అసలు మీరంతా నెత్తికెక్కించు కుంటున్నారు." అంటేను-

"అలా ఎందుకనుకుంటున్నావు. తనూ మనలాంటి మనిషేగా. ఆమెకున్న కీర్తి ప్రతిష్ఠలు మనం సంపాదించుకోగలమా. ఓర్పు మంచితనం మూర్తీభవించిన సుమిత్ర నిజానికి నాకు మనందరి కంటే ఉన్నతంగా కనిపిస్తుంది" అని జవాబొచ్చింది.

ఆ మాటే యథార్థం అయింది. సుమిత్ర తనకోసం ఎంత పని చేసింది. ప్రాణదానం చేసింది. సమయానికి సుమిత్ర ఆదుకుని ఉండకపోతే తనీపాటికి ఈ అందమైన ప్రపంచాన్ని వదిలివెళ్ళి పోయేది. బాధతో మూల్గుతూ మంచంమీద పడుకున్న సువర్ణ కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి, సుమిత్ర స్నేహ హృదయానికి కరిగిపోయి. కానీ ఆ బాధ తట్టుకోలేక కాదు. "ఇప్పుడెలా ఉంది సువర్ణా" అంటూ వచ్చింది విద్య. "నేను బాగానే ఉన్నానులే. కానీ నాబాధంతా ఒకటే. నిజం చెప్పువిద్యా, నన్ను సుమిత్ర క్షమిస్తుందా?"అంటూచేతులు పట్టుకుంది.

"నిన్ను దక్కించుకోవాలని తపన పడింది. నీకోసం ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కోటానికి ధైర్యం చేసింది. నీపట్ల ఎంత స్నేహానురాగాలు లేకపోతే అంత సాహసం చేస్తుంది!"

"నువ్వు ఊహిస్తున్నదాని కన్నా తీవ్రమైన అలజడినే ఎదుర్కొంది ఆరోజు. నువ్వు కడుపునొప్పితో మెలికలు తిరుగుతుంటే నీ బాధని మేమంతా కళ్ళతో మాత్రమే చూసాం. తను మనస్సుతో చూసింది. నిన్ను హాస్పటల్‌కి తీసుకెళ్ళగానే- తను ఫోన్ చేసింది. నీకు ఎపండిసైటిస్ అనీ, ఇరవైనాలుగు గంటల్లో ఆపరేషన్ చేయకపోతే నీకు ప్రాణాపాయం అనీ తెలుసుకొని తను ఎంత ఆవేదన పడిందో మాటల్లో చెప్పలేను. సమయానికి అంతడబ్బు అప్పుగానైనా దొరకక మీ నాన్నగారు అవస్థపడుతుంటే తను ఆ మొత్తానికి చెక్కు సంతకంపెట్టి ఇచ్చింది. తమతో మాట మాత్రమైనా చెప్పనందుకు వాళ్ళ ఒదిన శాపనార్థాలు పెడుతోంది: ఒకటా, రెండా అయిదు వేలు. వేలకి వేలు ధారపోశావు. వాళ్ళు నిన్నేం ఉద్ధరిస్తారు-అని; నిక్షేపంలా వడ్డీ వచ్చేది, మామీద గౌరవం లేనప్పుడు నిన్నెందుకు ఇంట్లో ఉంచుకోవాలి-అని"

"ఇంకేం చెప్పొద్దు విద్యా, వెంటనే ఒక్కసారి సుమిత్రను తీసుకురా" అంది ఆత్రంగా.

"తను ఈపాటికి వస్తూండాలి. మీ అమ్మతీసుకువస్తానన్నారు." సుమిత్ర రాగానే ఆమె చేతిని కళ్ళకద్దుకుంది సువర్ణ. "నువ్వు నన్ను క్షమించగలవా!?" అంది.

"స్నేహంలో క్షమార్పణలెందుకులే,"

"అలాక్కాదు సుమిత్రా. నిన్ను నేను మానసికంగా ఎంతో హింసించాను. ఎంత తేలిక భావంతో చూసానో నాకు తెలుసు."

"ఊరుకోవే, అవన్నీ ఇప్పుడెందుకు. నువ్వెప్పుడూ నాకు ప్రియనెచ్చెలివే." అంటూ సుమిత్ర సువర్ణ చేతిని ముద్దు పెట్టుకుంది. 'నిన్ను బ్రతికించుకున్నాను, అంతేచాలు.'

సువర్ణ కళ్ళనించి రెండు నీటిబొట్లు జారాయి. 'నా మూలానా నువ్వు ఇంట్లో ఎన్ని మాటలు పడుతున్నావు" అంది. సుమిత్ర నిట్టూర్చింది. "వదినకోపంలో ఏదో అంటున్నా, నన్ను బయటకు గెంటేయని పాటి మంచితనం అన్నయ్యలో ఉందిలే.-అంతకన్నా నాకేమీ అక్కర్లేదు.' సుమిత్ర గొంతు గద్గదికంగా పలికింది.

"సుమిత్రా నువ్వు నిజంగా సుమిత్రవే. మాకు బాహ్య నేత్రాలే ఉన్నాయి. నీ మనోనేత్రంతో కొడిగట్టబోతున్న ఓ దీపాన్ని వెలిగించావు."

"ఏదే ఏదే ఆమాటే అనవద్దు సువర్ణా, నేను వెలిగించుకున్నది నా స్నేహ దీపమే. దాన్నెప్పుడూ ఆరనివ్వకు," ఆర్తిగా సువర్ణ చుట్టూ చేయివేసింది.

●

(ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది - 5-3-92)